ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం - ఎ.వి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో రు. 5000/-ల నగదు బహుమతి పొందిన కథ

# గరిక పూలు

పి.వి. సత్యనారాయణ

‘జ్వరం తగ్గినట్టులేదే మామ్మగారూ. నిజం చెప్పండి మందు వేసుకోలేదు కదూ. రాత్రంతా ఆలోచిస్తూ బుర్ర పాడు చేసుకున్నారు, అవునా?’ శ్రావణ్ గంభీరమైన కంఠంలో మార్దవంతో కూడిన మందలింపు.

తెల్లని బట్టలలో... ప్రశాంతవదనంతో చిరునవ్వుతో ఉన్న శ్రావణ్ ధన్వంతరిలా అనిపించాడు మాలక్ష్మమ్మగారికి.

‘మీ అన్నాచెల్లెళ్లు నన్నెక్కడ వదుల్తారయ్యా... మందు వేసి మరీ వెళ్లింది మీ చెల్లెలు అమృత’ అందావిడ ఆప్యాయంగా.

‘అంటే మీ ఆలోచన మూలంగా జర్వం ఎక్కువైందన్నమాట.’

‘ఏమి ఆలోచనలు బాబూ! వేలకు వేలు పోసి, నా కడుపు కట్టుకుని చదివించిన కొడుకులు నా నెత్తిన చెయ్యి పెట్టారు. ఎవరికీ పనికి రాని నేను, ఏ తల్లి కన్నబిడ్డలో, మీకెందుకయ్యా ఇంత తాపత్రయం?’

‘అదిగో మళ్లీ మొదటికి వచ్చారా. మీరు ఇలాగే అనారోగ్యంతో ఉంటే నాకీ పూట పస్తే మరి.’

కంగారుగా మంచంలో లేచి కూర్చోబో యింది మాలక్ష్మమ్మ.

‘వద్దులే నాయనా... ఇక ఆ పాపిష్టివాళ్ల గురించి ఆలోచించను గాక ఆలోచించను. నా కోసం నువ్వు పస్తులుంటే నాకు మరింత పాపం!’ శ్రావణ్ సంధించిన అస్త్రానికి లొంగిపోయింది ఆవిడ.

‘అలా రండి దారికి. అమృత మరో గంటలో డాక్టర్ని తీసుకుని వస్తుంది. ఈ లోగా ప్రశాంతంగా ఏ ఆలోచనలూ లేకుండా పడుకోండి’-మాలక్ష్మమ్మగారికి దుప్పటి కప్పి తల నిమిరి బయటికొచ్చాడు శ్రావణ్.


‘బాబూ! మీ కోసం ఎవరో ఒకాయన వచ్చాడయ్యా. మన ఆఫీసు రూంలో కూర్చోబెట్టాను’-అనంతమ్మగారు శ్రావణ్‌కి ఎదురయింది.

‘పార్వతీశంగారిని కూడా పలకరించి వస్తాను. మీరు పదండమ్మా...’ అన్నాడు శ్రావణ్.

‘ఆనందాశ్రమం’ అన్న బోర్డు మీద భానుని కిరణాలు పడి అందంగా మెరుస్తున్నాయి అక్షరాలు.

సుమారు వెయ్యి గజాల ఆవరణలో నాలుగు పాకలు-కొత్తగా వేసిన పచ్చి తాటాకుల వాసన ఇంకా పోనట్టుంది. అదొక రకమైన వింత పరిమళాన్ని ఆ పరిసరాలకు అందిస్తోంది.

అన్నాచెల్లెళ్లయిన అమృత, శ్రావణ్ ఆశ్రమం మొదలుపెట్టి ఏడాదే అయినా, చేరిన వృద్ధులకు ఆదరాభిమానాలు పుష్కలంగానే లభిస్తున్నాయి.



విదేశాల్లో సెటిలైన కొందరు తనయులు, నిస్వార్థ సేవాతత్పరతతో అచిరకాలంలోనే మంచి పేరు గడించిన ఆనందాశ్రమంలో తమంతట తామే వృద్ధులను చేర్పించి, కొంత డబ్బు చెల్లించి వెళ్తుంటారు. మరి కొందరు తమంత తామే ఇళ్లలో ఒంటరితనాన్ని భరించలేక వచ్చి చేరుతుంటారు. ఇంకొంత మంది పొమ్మనలేక పొగ బెట్టే కొడుకుకోడళ్ల పోరు పడలేక వచ్చి చేరిపోతుంటారు.

అన్నింటి కన్నా ముందున్న పాక మొదట్లో ఒక రాటకు మామిడాకుల తోరణం వేలాడుతోంది. ‘ఆఫీసు’ అన్న చిన్న బోర్డు దాని మీద మేకుతో కొట్టబడివుంది.

ఆఫీసు లోపలంతా పచ్చని పేడతో అలికి ఎన్నాళ్లో కానట్టు తెలుస్తోంది. తెల్లని సున్నంతో, చక్కని రంగవల్లికలతో లోపల అదో అద్భుతలోకంలా ఉంది. లోపల అంత అందం గా ఉందన్న విషయం, లోపలికి అడుగు పెట్టేంతరకు ఎవరికీ తెలియదు. హాయిగా విశాలంగా ఉన్న భాగానికి రెండు వైపులా తడికలతో కట్టిన నాలుగు గదులు-కుడి చేతి వైపు గదిలో ఒక టేబిల్ ఉంది. చూడ్డానికి పాతదైనా పాత కాలం నల్లచెక్కతో చేయబడి నాలుగు అంచుల దగ్గరా చక్కని వంపులతో జమీందారీ స్థాయిని తెలియజేస్తూ ఉంది.

టేబుల్ వెనకనున్న చెయిర్‌లో కూర్చుని అమృత-మధ్యమధ్యలో ఎడం చేత్తో ముంగురులు వెనక్కి తోసుకుంటూ దీక్షగా ఏదో రాసుకుంటూ ఉంది.

తెల్లని వాయిల్ చీర చిన్న ప్రింటెడ్ పువ్వులు- సన్నటి మనిషికి జడ అరచేతి మందాన నల్లత్రాచులా కుర్చీ వెనక్కి వేలాడుతోంది. జడలో తురుముకున్న ఒకే ఒక తెల్ల గులాబీ అమృతకు మరింత అందాన్ని సంతరించిపెట్టింది.

చెవులకు మెరుస్తున్న చిన్న స్టడ్‌లు... మెడలో సన్నటి చైన్... చేతులకి రెండు గాజులు... సింపుల్‌గా, హుందాగా ఉంది. ఏదో రాస్తున్న ఆమె ఒక్క సారిగా ఉలిక్కిపడి తలెత్తి చేతికున్న వాచీ చూసుకుంది.

పది గంటలు...

‘అరె, చాలా టైమయిందే?’ కుర్చీ వెనక్కి జరిపి లేచి నిలబడింది.

టేబుల్ మీద కాగితాలు నీట్‌గా సర్ది బొత్తిపెట్టి సొరుగు లోంచి తీసిన నీలం రంగు ఫైల్‌లో పెట్టింది. ఒక్కసారి వేళ్లు మెటికలు విరుచుకుని టేబుల్ మీద బేగ్ నందుకుంది.

శ్రావణ్ లోపలికి వచ్చాడు నవ్వుతూ, ‘హలో... ఏంజెల్!’ అంటూ.

‘అన్నయ్యా! నువ్వొచ్చేశావుగా. ఇవాళ కార్డియాలజిస్ట్ లోకేశ్వర్రావుగారు ఆశ్రమానికి వచ్చి మనవాళ్లను చూస్తామన్నారు. నేను వారిని పికప్ చేసుకుని వస్తాను.’

ఆమె వెళ్లగానే లోపలికి వచ్చాడు ఓ నడి వయస్కుడు.

‘నమస్కారమండీ... మీతో మాట్లాడాలి. నా పేరు...’ అంటూ పరిచయం చేసుకున్నాడాయన.

‘కూర్చోండి.’

‘మా అమ్మగారిని పిలిపిస్తే మాట్లాడాలి.’

మీ అమ్మగారంటే?...’ పేరు చెప్పమన్నట్లు ప్రశ్నార్థకంగా చూశాడు శ్రావణ్.

‘కథలు చెప్పేపార్వతమ్మగారు...’

‘ఓ... అయితే... మీరు పార్వతమ్మగారి పెద్దబ్బాయి సూర్యారావు గారనుకుం

టాను.'

'అవునండీ... మా అమ్మగారు మాకెవరికి చెప్పాపెట్టకుండా ఆర్నెల్ల క్రితం వచ్చేసి మీ ఆశ్రమంలో చేరింది.'

'ఇంతకీ మీ అమ్మగారితో మాట్లాడాలంటారు...'

శ్రావణ్ ప్రశాంతంగానే అన్నా ఆ మాటకు దెబ్బ తిన్న సర్పంలా ఎందుకో సర్రున లేచాడతడు. 'ఏం మీకేమైనా అభ్యంతరమా? అసలు మా పర్మిషన్ లేకుండా ఆవిడను ఇక్కడెలా చేర్చుకున్నారు? రేపు ఆవిడకేదైనా అయితే?'

సూర్యారావు మాటల్లో కటుత్వానికి అతడు నివ్వెరపోలేదు. అతని కిలాంటివన్నీ అలవాటే.

అప్పుడప్పుడు... తమ పరువుకేదో భంగం కలిగినట్టు బాధపడే బంధువులు, ఇక్కడ శాంతిగా, స్వేచ్ఛగా బ్రతికుతున్న వృద్ధుల కిష్టం లేకపోయినా తిరిగి వాళ్లను తీసుకుపోతుంటారు.

'మీరెందుకంత ఎక్సయిట్ అవుతున్నారు? మేమేమీ ఆవిడతో మిమ్మల్ని మాట్లాడవద్దనలేదే?' శ్రావణ్ ఆయాను పంపి పార్వతమ్మగారిని పిలిపించాడు.

ఎప్పుడూ తనే వచ్చి పలకరించే శ్రావణ్, తనని ఎందుకు పిలిపించాడో అర్థం కాలేదు పార్వతమ్మగారికి. తీరా అక్కడికి వచ్చాక పెద్ద కొడుకు సూర్యారావును చూసి ఒక్క క్షణం తొట్రుపడింది.

కొడుకులైనా సరే, వాళ్లు మనను ప్రేమించలేనప్పుడు, పరాయివాళ్లగా అనిపిస్తారు. మనమంటే అభిమానం చూపేవారు, ఆత్మీయతతో కరిగించేవారు పరాయివాళ్లయినా సరే, వాళ్లెంత దూరాన ఉన్నా సరే, మనవాళ్లుగా అనిపిస్తారు.

కొడుకుతో మాట్లాడేందుకు పెద్దగా ఆసక్తిని చూపలేదు ఆవిడ.

కాని సూర్యారావే... కళ్ల నీళ్లతో... 'అమ్మా! కన్నబిడ్డల్ని మమ్మల్ని అన్యాయం చేస్తావా? తమ్ముడి దగ్గరున్నావనుకుని నిన్ను చూడాలనుకుని వెళ్తే వాడు గోల... అమ్మ చెప్పాపెట్టకుండా వెళ్లిపోయిందని-నువ్వెక్కడు న్నావో. గాలించి వెతికి పట్టుకునేందుకు ఇంత కాలం పట్టింది.'

'పోనీలే నాయనా! అంతా కులాసానా?' పార్వతమ్మగారు కొడుకును బంధువు నడిగినట్టే అడిగింది.

'మా మీద కోపం పోలేదా అమ్మా! తమ్ముళ్లంతా నీ మీద బెంగ పెట్టుకున్నారు. ఇంత మంది కొడుకులు, కూతుళ్లు, ఉండి నీకీ ఆశ్రమంలో అనాథలా ఉండే కర్మ మేమిటమ్మా ?'

'నాకిక్కడ చాలా బాగుంది నాయనా! ఇది అనాథాశ్రమం కాదు. నాలాంటి వృద్ధుల పాలిటి కల్పతరువు.'

'ఏమైనా నువ్విక్కడ ఉండేందుకు వీల్లేదు. తల్లిని రోడ్డు మీద పడేశారని నలుగురూ మాకు గడ్డి పెడుతున్నారు. నువ్వు నాతో రాక తప్పదు!'

'అదన్నమాట సంగతి. అయినా నేను రాలేను నాయనా!' సౌమ్యంగానే అంది పార్వతమ్మగారు.


అతగాడు తల్లినేమీ అనలేక, శ్రావణ్ మీద విరుచుకుపడ్డాడు. "తల్లీబిడ్డల్ని విడదీసే హక్కు మీకు లే"దన్నాడు. వృద్ధుల ద్వారా డబ్బు సంపాదించే పథకాలు వేస్తున్నారన్నాడు. ఇంకా చాలా చాలా అన్నాడు.

శ్రావణ్ ఆవేశపడలేదు. అతని ముఖంలో ప్రశాంతత చెక్కు చెదరలేదు. వీలైనంత సౌమ్యంగానే చెప్పాడు. 'మీరు వచ్చిన పని పూర్తయితే వెళ్లి రండి, అమ్మా పార్వతమ్మ గారూ! మీకు ఇష్టమై మీరు మీ అబ్బాయితో వెళ్తే మాకెవరికీ అభ్యంతరం లేదు. మా క్కావలసిందల్లా మీ సంతోషమే.'

'అబ్బ... ఏం నంగనాచి కబుర్లు...! మా అమ్మ ఎలా రాదో కోర్టు ద్వారా తేలుస్తాను.'

ఏమనుకుందో ఏమో పార్వతమ్మ అప్పుడు నోరు విప్పింది. 'ఒక్క క్షణం కూర్చో బాబూ నీతో మాట్లాడాలి.'

ఆశ్రమం లోపలికి వెళ్లి వచ్చిన పార్వతమ్మగారి చేతిలో చిన్న సంచీ వుంది. 'పద నాయనా, ఇంటి కెళ్లిపోదాం. నాకెలాగూ... ఇంటి మీద బెంగగా వుంది. వద్దామనే అనుకుంటున్నాను. కాని మీ అందరి మనసులూ ఎలా ఉన్నాయో తెలీక ఆగిపోయాను. కాని నిన్ను చూస్తుంటే అమ్మ కోసం మీరంతా ఎంత బాధపడుతున్నారో అర్థ మయింది. నాక్కావలసిందేముంది? పద, వెళ్దాం. నాయనా... శ్రావణ్! వెళ్లొస్తాను. ఆశ్రమం వదిలి వెళ్తే ఏమనుకుంటారోనని భయపడ్డాను. కాని అభ్యంతరం లేదన్నావుగా. అమృతకు



చెప్పకుండానే వెళ్లిపోతున్నాను. ఏమీ అనుకోవద్దని చెప్పు.'

పార్వతమ్మగారి కొడుకు సూర్యారావు మొహం ఆనందంతో వెలిగిపోయింది.

ముఖం తిప్పుకున్నా పార్వతమ్మగారి కళ్లలో తిరిగిన నీళ్లు శ్రావణ్ దృష్టిని తప్పించుకోలేకపోయాయి.

ఒకరికి తినడానికి మహా ఇష్టమైన ఒక వస్తువును ముందుపెట్టి, 'ఎంత తింటావో ఇప్పుడే తిను. జన్మలో మళ్లీ ఇంకెప్పుడూ తినకూడదు' అంటే వీలైనంత ఎక్కువ తింటాడా వ్యక్తి. అలాగే జన్మలో ఇంకెప్పుడూ ఏడవకూడదు. కంట్లో నీళ్లు ఒక చుక్క కూడా మిగలకూడదు. ఇపుడే ఏడ్చేయాలి-అని ఎవరో అన్నట్టే అశ్రువులు జలజలా రాలిపోతున్నాయి. ఆ వృద్ధురాలి కళ్ల నుండి. ఏడాది క్రితం పార్వతమ్మగారు ఆశ్రమంలోకి అడుగు పెట్టిన రోజు శ్రావణ్‌కు ఇంకా బాగా గుర్తుంది.

000

ఆ రోజు...

అక్కడ కూర్చున్న స్త్రీ, 'మీరు లోపలికి రండమ్మా!' అంది అమృత. లోపలికి అడుగు పెడుతూనే భోరున ఏడ్చిందావిడ.

'ఊరుకోండి. మీకేం పరవా లేదు' అంటూనే కూజా లోంచి గాజు గ్లాజులోకి నీళ్లు నింపి ఆమె చేత తాగించాడు తను.

ఇక్కడకు వచ్చిన వృద్ధులు చాలా మంది తమ వాళ్లకు దూరమయ్యామనో, లేక వాళ్ల నిరాదరణ మూలంగా ఆశ్రమా లకు వస్తున్నామనో మరి ఇలాగే ఏడుస్తారు.

'ఇప్పుడు చెప్పండి మీ విషయం.'

వెక్కిళ్లు తగ్గాక ఆవిడ నోరు విప్పింది. 'పేపర్లో మీ ప్రకటన చూసి తెగించి వచ్చేశాను బాబూ... ఆ యింట్లో బానిసలా బ్రతికే కంటే అదే పని ఇక్కడ చేస్తే నాలుగు మెతుకులు దొరుకుతాయి.'

'మీదే వూరు అమ్మా!' ఆప్యాయంగా అంది అమృత కంఠం.

'ఏ వూరయితేనేమమ్మా... మీరిక్కడ కాదంటే...' ఆవిడ గొంతు పూడుకుపోయింది దుఃఖంతో.

'నేనడిగేది మిమ్మల్ని తిరిగి పంపించేందుకు కాదమ్మా. మీ వివరాలు ఇక్కడ రిజిస్టర్‌లో రాసుకునేందుకు.'

'నాకు నలుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. నా భర్త తాసిల్దారు. మహారాజులా బ్రతికారు. ఆయనున్నన్నాళ్లూ నేనూ మహారాణి భోగాలు అనుభవించాను. పిల్లలందరికీ మంచి చదువులు చెప్పించి పెళ్లిళ్లు చేశాం. ఆయన పోయేసరికి ఆస్తి ఏం మిగలకపోయినా పిల్లలందరూ మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు 'నీ జీవితం హాయిగా గడిచిపోతుంది.' అన్న మా వారి మాటలు గుర్తు తెచ్చుకుంటూ రవంత ఆశ మిగుల్చుకున్నాను.

వాళ్లకు తెలియని మణిమాణిక్యాలు నా దగ్గరున్నాయేమోనని పిల్లలంతా తలో ఆర్నెల్లు నన్ను వాళ్ల దగ్గరుంచుకుని బాగానే చూశారు. కాని తండ్రి దానగుణం వల్ల నా చేతికి నాలుగు జతల బంగారు గాజులు తప్ప మరేం మిగల్లేదని గ్రహించిన కొడుకులు, వాటిని లాక్కునేందుకు నానా ఉపాయాలు పన్నారు. వాళ్లు ప్రయోజకులయ్యేందుకు అంత వరకు నా ఒంటి మీది బంగారంతో సహా ఊడ్చి నిర్భయంగా ఇవ్వగలిగినాను. నాకెందుకో జీవితమంటే మొదటిసారి భయం కలిగింది. అందుకే వాటిని త్యాగం చెయ్యలేకపోయాను. కొడుకుల కంటే కూతుళ్లకే తల్లి మీద మమకారం ఎక్కువంటారు. కానీ కూతుళ్లు, కొడుకులకే మాత్రం తీసిపోలేదు. చిన్న కూతురికి అభిమానమున్నా అల్లుడికున్న చిన్నపాటి ఉద్యోగం, పిల్లలతో వాళ్లకి నేను భారం కావడం ఇష్టంలేకపోయింది. కాని ఇలా తలో ఆర్నెల్లు పిల్లల మధ్య తిరగడం, నాకు తెలియకుండానే నా దగ్గర శరీరాన్ని అంటిపెట్టుకుని ఉన్న బంగారు గాజులు గిల్టువెలా అయిపోయాయో నాకే అర్థం కాని స్థితిలో పడిపోయాను. పిల్లలంతా నన్ను నానా ఆరడీ పెట్టారు.

"నేనే నాకిష్టమైన వాళ్ల దగ్గరెవరి దగ్గరో దాచేసుకున్నానని అనుమానంతో, ఆ బంగారం తమకి దక్కలేదనే దుగ్దతో, తల్లినని కూడా చూడకుండా మరిచిపోయి నానా మాటలతో, చేతలతో హింస పెడుతూనే ఉన్నారు.

"నన్ను మెడ పట్టి గెంటలేదు తప్ప అంత పనీ జరుగుతోంది రెండు నెలల కో సారి. నన్ను ఉంచుకో వలసిన ఆ రెండు-మూడు నెలల్లోనే వాళ్లకు లెక్క లేనన్ని ఖర్చు లుంటాయి. నేనొక కాని తెచ్చుకున్న తద్దినంలా కనబడుతున్నాను వాళ్లకి. ఆ రెండు నెలలూ నన్ను చూసి సంతోషించేది నా మనవలే. ఏ కల్మషం లేని ఆ పసిమనసులకి నేను చెప్పే కథలు అమృతపు సోనలు... నన్ను చూడగానే వాళ్ల కళ్లల్లో వెలుగులు. వాటి మూలానే అన్ని చీదరింపులు, ఛీత్కారాలను బలవంతాన దిగమింగేదానిని.

'నాకే విలువ లేదు గానీ నా పేరుకి ఉంటుందంటే చెప్తాను. పార్వతి... ఇల్లలికే ఈగలా ఈ పేరు ఎపుడో మరిచిపోయాను. మాధవరావుగారి తల్లి అనో, సుభద్ర అత్తగారో, శ్వేత మామ్మ అనో తప్ప నా పేరు వినిపించాల్సిన అవసరం ఇంత వరకు రాలేదు.'
'మీరు నిజంగానే కథలు బాగా చెప్పగలరు పిన్నిగారూ!' హాయిగా నవ్వాడు శ్రావణ్.

కాని...కాని... నా కథల వల్ల పిల్లల చదువులు పాడవుతున్నాయనే నెపం తో కోడలు వాళ్లను నా దగ్గరకే చేరనిచ్చేది కాదు. నేనెందుకు బ్రతకాలో నిర్ణయించుకోలేక సతమతమైపోయాను. అక్కడికీ నేను వెళ్లిన చోటల్లా నాకు చేతనైన పని చేస్తూనే వున్నా, వాళ్లకి తృప్తి లేక ననొక గుదిబండలా చూశారు.

"కాని నాకెక్కువ బాధ కలిగించిన దొక్కటే! మరణం అనేది ఎవరి కెక్కడ ప్రాప్తిస్తుందో ఎవరికీ తెలియదు. కాని నేను ఎవరి దగ్గర చచ్చిపోతే వాళ్ల కెక్కువ ఖర్చు తగులుకుంటుందోననే నెపంతో వాళ్ల మాటలు వింటుంటే వీళ్లు కడుపున పుట్టిన బిడ్డలా లేక, రాక్షసులా అనే అనుమానం నన్ను తొలిచేసేది.

"ఇంట్లో పనంతా చేసి కూడా నేనొక పురాణం వినేందుకు వెళ్లకూడదు. ఎవరితో మాట్లాడకూడదు అనే ఆంక్షల మధ్య జీవచ్ఛవంలా ఉన్నాను. నేనెవరితో మాట్లాడినా వాళ్ల పరువుకు భంగం కలుగుతుందని వాళ్ల అభిప్రాయం. వాళ్ల దృష్టిలో నేనొక పనికిమాలిన వస్తువును. గడ్డిపరక కన్నా హీనం.

"ఏ జన్మలో ఏం పాపం చేశానో గాని, బిడ్డల్లో ఒకరు కాకపోతే ఒకరికైనా నా పట్ల మమకారం లేదు. వీళ్ల భవిష్యత్తు గురించి నా భర్తా, నేనూ రాత్రింబగళ్లు ఎంత ఆదుర్దా పడ్డామో తలుచుకుంటే నాకే ఆశ్చర్యం కలుగుతుంది. అందులో రవంతైనా నా భవిష్యత్తు గురించి ముందు జాగ్రత్త పడివుంటే ఇప్పుడు ఈ బాధలు తప్పేవి. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం లాంటిదే. వినడానికి కట్టుకథలా ఉందేమో గాని..."

ఆవిడ మొహం అభిమానంతో ఎర్రబడింది.

అమృత, శ్రావణ్ చెక్కినశిల్పాల్లా చెంపకు చెయ్యి ఆనించుకుని వింటున్నారు తప్ప ఎటువంటి భావప్రకటన చెయ్యలేదు. ముసలావిడ కళ్లు తుడుచుకుంది కొంగుతో.

వాళ్లిద్దరికీ తెలుసు... భావాలన్నీ బయటకు వెళ్లగక్కేస్తే తప్ప ఆవిడ దుఃఖభారం తీరదు. భారం తీరాక హృదయం తేలికపడి నిర్మలంగా అద్దంలా అనిపిస్తుంది. అప్పుడు మనం చక్కని ప్రతిబింబాన్ని చూడగలం.

'ఏ బాదరబందీ, ఆధారం లేని వృద్ధులు మా ఆనందాశ్రమంలో చేరవచ్చు...' అంటూ మీరిచ్చిన ప్రకటన చూసి నాకొక మొండి ధైర్యం వచ్చింది బాబూ!. నేనెవరికీ పనికి రాకుండా పోయాను. వాళ్ల దృష్టిలో నా తిండి వృథా. అసలు బ్రతుకే అనవసరం. అందుకే ధైర్యంగా గడప దాటాను. అలాగని దొంగతనంగా రాలేదు. నేను వెళ్లిపోతానంటే మా మనవడు గోపాలం. మనవరాలు శ్వేత ఏడ్చారు తప్ప చిన్న కొడుకు, కోడలు, నిమ్మకు నీరెత్తినట్టే ఉండి పోయారు. మౌనం అర్థాంగీకారం అనుకుని వచ్చేశాను. అమ్మాయ్! నాకిప్పుడు అరవై రెండేళ్లు. కాని ఇక్కడ బరువుగా ఉండిపోయాను. నేను చెయ్యగలిగిన సాయం చేస్తాను. ఈ నీడలో నాకింత చోటివ్వండి బాబూ... చాలు' ఆవిడ గొంతులో స్థిరత్వం అంది ఈ సారి.

అప్పుడు నోరు విప్పింది అమృత-'ఇన్ని చెప్పారు గాని మీ పేరు చెప్పలేదు నాకు.'

'నాకే విలువ లేదు గానీ నా పేరుకి ఉంటుందంటే చెప్తాను. పార్వతి... ఇల్లలికే ఈగలా ఈ పేరు ఎపుడో మరిచిపోయాను. మాధవరావుగారి తల్లి అనో, సుభద్ర అత్తగారో, శ్వేత మామ్మ అనో తప్ప నా పేరు వినిపించాల్సిన అవసరం ఇంత వరకు రాలేదు.'

'మీరు నిజంగానే కథలు బాగా చెప్పగలరు పిన్నిగారూ!' హాయిగా నవ్వాడు శ్రావణ్.

'ఒక్క పేరు అడిగితేనే ఇంత వ్యాఖ్యానం చేశారు! సరే మీరిక్క

దుండేందుకు మాకేం అభ్యంతరం లేదు. నిశ్చింతగా ఉండండి. మీరు ఐదు నిమిషాలు బయట కూర్చుంటే మా అమృత వచ్చి మీ రెక్కదుండాలో చూపిస్తుంది. మీరు వెళ్లి బెంచీ చివర కూర్చున్న పెద్దాయనను లోపలికి పంపండి.'

తేలిక పడిన మనసుతో పార్వతమ్మగారు బయటకు నడిచింది.

అమృత శ్రావణ్‌కేసి చూసింది. 'పార్వతమ్మగారు అబద్ధం చెప్పి వుంటే...'

'చెప్పలేదు... కచ్చితంగా చెప్పగలను. అంతవరకూ ఆ కళ్లలో నిజాయితీ ప్రతిఫలిస్తోంది. కళ్లు హృదయాన్ని ప్రతిబింబిస్తాయి. అనే మాట నిజమైతే నామాటా నిజమే. కాని. ఈమె కొడుకులు మూడు నెలల వరకూ మన మీద దాడి చెయ్యరు.'

'దాడా? ఎందుకు?'

నవ్వాడు శ్రావణ్... 'నాకు అందిన సైకాలజీ ప్రకారం-మనిషి ఒక వస్తువు తనకి పనికి రానిదైతే ఊరుకుంటాడు కాని మరొకరికి పని కొస్తే సహించలేడు. ముఖ్యంగా ఈమె కొడుకుల లాంటి మనస్తత్వం గలవాళ్లు. ఇక ఆమెను వస్తువు అన్నానని ఏమీ అనుకోకు అమృతా... వాళ్ల దృష్టిలో ఆమె ఒక పనికిమాలిన వస్తువే. కాని వాళ్లకు తెలియనిదల్లా ఆమె వెల లేని మాణ్యిం అని.'

'ఎలా?' శ్రావణ్ ఆలోచనలను అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది అమృత.

'ఆవిడ కథలు బాగా చెప్పగలరు... అని నాకు బాగా నమ్మకంగా ఉంది. ఒక నెలలోగా ఆ విషయం ప్రయోగపూర్వకంగా రుజువు చేస్తాను. 'అమ్మమ్మ చెప్పిన కథలు' కేసెట్లు విడుదలవగానే అమ్మమ్మగారి కొడుకుల వ్యథ మొదలవుతుంది. చూడు, సరిగ్గా ఇలాగే జరుగుతోందో లేదో...'

అన్నయ్యకేసి ప్రశంసాపూర్వకంగా చూసి అమృత వేలికొసలతో ముంగురులు సవరించుకుంది సుతారంగా. అంటే... శ్రావణ్ మాటలు... అక్షరాలా నిజం చేసింది పార్వతమ్మగారు!

అమృత ఆవిడ చేత తను రాసిన పిల్లల కథల ప్రయోగం చేయించింది.

ఎవరూ ఏమీ మాట్లాడలేదు. కాని అందరి మనసుల్లో పార్వతమ్మ గారే మెదిలింది. ఆవిడ వెళ్లిపోవడం ఆశ్చర్యపరచడమే కాకుండా ఎందుకలా చేసిందా అన్నదే అందరి ప్రశ్న. ఇక్కడికి వచ్చిన ఆచిరకాలంలోనే ఆవిడ బాగా తేరుకుంది. అంత సంతోషం జీవితంలో ఎప్పుడూ కలగలేదన్నది. బహుశా తన టాలెంటు అర్థమై తన సంపాదన తన బిడ్డలకు చేరాలనుకుందేమో!

రోజూ రిహార్సల్స్... పార్వతమ్మగారు అతిస్వల్పకాలంలో అమృత, శ్రావణ్‌ల సూచనలు అలవాటు చేసుకున్నారు. రికార్డింగ్ రూంలోకి వెళ్తూంటే ఆవిడకి మొదట చాలా భయం వేసింది.

మారుతీ కేసెట్ కంపెనీ ఓనర్ రాజారావు, అమృత స్నేహితురాలు మానస తండ్రి.

ముందు పెదవి విరచినా అతికష్టం మీద పార్వతమ్మగారి చేత కథలు రికార్డింగు చేయించేందుకు ఒప్పుకున్నాడు. మానస ఈ విషయంలో చాలా సహకరించింది.

పార్వతమ్మగారిని బాగా ఉత్సాహపరచి, బాగా ధైర్యం చెప్పి మొదటి కథ చెప్పించింది అమృత.

నెల రోజులకు పైనే పట్టింది మొత్తం కథలకు.

అది సక్సెస్ అయితే చూడవచ్చనుకున్నారు శ్రావణ్, అమృత. కాని పార్వతమ్మ అదృష్టమో, శ్రావణ్ నోటి మాట ఫలమో... మానస, అమృత పడిన శ్రమో... రాజారావుగారి పరపతో.... ఏమైతేనేం, వారి శ్రమ వృథా కాలేదు. పిల్లలకు స్వంత అమ్మమ్మ చెబుతున్నట్టే ఉన్నాయేమో 'అమ్మ చెప్పిన కథలు' కేసెట్లు హాట్‌కేక్స్‌లా అమ్ముడుబోయాయి.

దాంతో నెల తిరక్కుండానే రాజారావుగారే ఆశ్రమానికి స్వయంగా వచ్చారు.

'అమ్మాయ్ అమృతా! అమ్మమ్మ కథలు' హక్కులు నాకు అమ్మితే సరేసరి. లేదా మరెవరికీ ఇవ్వనని వాగ్దానం చెయ్యండి. అందుకే వచ్చానమ్మా! మరో వెయ్యి కాపీలకు ఆర్డర్లు వచ్చాయి. మనం వీలు చేసుకుని మరిన్ని కథలు చేద్దాం.'

'అలాగే నెమ్మదిమీద చేయిద్దాం. ఆవిడ కూడా పెద్దవారు కదా!' అన్నాడు శ్రావణ్.

వ్యాపారదృష్టితో కాదుకదా తాము ఈపని చేపట్టింది?

పార్వతమ్మ మాత్రం శ్రావణ్ చేతులు పట్టుకుని ఊపేసింది. అమృతను కౌగలించుకుని ముద్దాడింది.

'దమ్మిడీ విలువ లేని నాకు ఎంత బ్రతుకు నిచ్చారమ్మా అన్నాచెల్లెళ్లిద్దరూ! నాకీ తృప్తి చాలు. ఇందులో పైసా కూడా నాకు వద్దు. ఆశ్రమానికే వినియోగించు. నాబోటివాళ్లు బాగు పడతారు. ఇన్నాళ్లూ నేనెవరికీ పనికిరానిదాన ననుకునేదానిని. కాని ఇక్కడి బాలమందిరంలో నాకు టైమే తెలియడం లేదు. ఆ చిట్టి పాపాయిల కబుర్లు వింటూ వాళ్ల ఊఊల మధ్య కథలు చెప్పుకుంటూ బ్రతుకెంతో మధురం అనిపిస్తోంది. పుట్టి బుద్దెరిగినప్పటి నుంచి ఇంత ఆనందం నేనెప్పుడూ అనుభవించలేదు."

**000**

కాని ఇప్పుడు పెద్ద ఉపద్రవమే వచ్చిపడింది. అంది పార్వతమ్మగారి పెద్ద కొడుకు సూర్యారావు రూపంలో.

ఇంత వరకు కొడుకుతో వెళ్లనన్న ఆవిడ అంతలోనే మనసు మార్చుకుని ఎందుకు వెళ్లిపోతానంటున్నారో శ్రావణ్‌కు అర్థం కాలేదు. అయినా అతని హృదయం దయతో ఆర్ద్రమైంది.

పాపం, ఆవిడకి ఇప్పుడు కొడుకుని చూశాక తక్కిన కొడుకులు, మనవలు గుర్తొచ్చి వుంటారు. తాము కోరుకునేది అదే. ఈ ఆనందాశ్రమం అనాశ్రితులకు ఆశ్రయం ఇస్తుందే తప్ప, ఎవరినీ పట్టి బంధించదు. వాళ్లంతట వాళ్లు కావాలనుకుని ఈ వృద్ధుల్ని ప్రేమతో తీసికెళ్తే తమకి కావలసిందేముంది? కాని... సందేహాలతో వాళ్ల మనసు బాధ పెట్టకూడదు.

'అమ్మా... చాలా సంతోషం. జాగ్రత్తగా వెళ్లిరండి. మీకెప్పుడు చూడాలని వున్నా ఆనందాశ్రమం ద్వారాలు తెరిచే వుంటాయి.'

శ్రావణ్ మాటలకు ఆవిడ వెనక్కి కూడా తిరిగి చూడలేదు.

తల్లిని జాగ్రత్తగా పొదివి పట్టుకుని కొడుకు వెళ్లిపోయాడు.

శ్రావణ్ మనసులో ఆ రోజే మరో పాయింటు రికార్డయింది. అందరికీ అది విడమరచి చెప్పాలనుకున్నాడు.

ఆ మర్నాడు అందరినీ పిలిచి చిన్న సమావేశంలా ఏర్పాటు చేసి చెప్పింది అమృత.

'చూడండి. ఆనందాశ్రమం అందరికీ ఆనందం కలిగించేందుకే గాని మీ పెద్దవాళ్ల మనసులు బాధించేందుకు కాదు. ఇక్కడికి వచ్చాక మీ మనసులు కుదుటపడి-ఎవరికైనా తిరిగి ఇళ్లకు తిరిగి వెళ్లాలనిపిస్తే మేం మీ కుటుంబసభ్యులకు కబురు చేసి ఆ ఏర్పాట్లు చేస్తాం. ఎంతైనా కన్న మమకారం ఊరికే పోదు కదా! ఏదో తాత్కాలికంగా ఇంట్లో వారి మీద కోపం వచ్చినా మళ్లీ వెళ్లేందుకు ఎలాంటి సంకోచమూ పడొద్దు... అని స్పష్టం చేసేందుకే ఇది ఏర్పాటు చేశాం. తిరిగి వెళ్లదలుచుకున్నవాళ్లు అన్నయ్యకు పేర్లు ఇస్తే పంపించే ఏర్పాట్లు చేస్తాం.'

ఎవరూ ఏమీ మాట్లాడలేదు. కాని అందరి మనసుల్లో పార్వతమ్మ గారే మెదిలింది. ఆవిడ వెళ్లిపోవడం ఆశ్చర్యపరచడమే కాకుండా ఎందుకలా చేసిందా అన్నదే అందరి ప్రశ్న. ఇక్కడికి వచ్చిన ఆచిరకాలంలోనే ఆవిడ బాగా తేరుకుంది. అంత సంతోషం జీవితంలో ఎప్పుడూ కలగలేదన్నది. బహుశా తన టాలెంటు అర్థమై తన సంపాదన తన బిడ్డలకు చేరాలనుకుందేమో! ఇక్కడ చెప్పేందుకు

మొహమాటపడి వుంటుంది.

అమృత, శ్రావణ్ ఎందుకో అలా సరిపెట్టుకోలేకపోయారు. ఈ వృద్ధులు చాలా తెలివైనవాళ్లు. వాళ్ల అభిప్రాయాలు, ఆలోచనలు, ఉత్సాహం చూస్తూంటే, వాళ్ల అనుభవాలను యువత తెలుసుకుని మార్గదర్శకం చేసుకోవచ్చు అనిపిస్తుంది.

అందుకే ఆదివారాలు అందరితో కూర్చుని ఆశ్రమం బాగోగులు చర్చిస్తారు. సలహాలు స్వీకరిస్తారు. వాళ్ల బాధలన్నీ తీరిగ్గా వింటారు. వాళ్ల ఆనందాన్ని పంచుకుంటారు.

ఆ వృద్ధులు కూడా వచ్చే వారంలో ఎవరెవరు ఏయే పనులు పంచుకోవాలో ఆలోచించుకుంటారు. తమ ఆలోచనలను అమృత ఆమోదిస్తుంటే, వాళ్ల కళ్లల్లో కోటి నక్షత్రాల కాంతులు...

ఆశ్రమంలో ఎవరి మీదా ఎవరి ఆధిపత్యమూ ఉండదు... ఎవరి కిష్టమైన పనులు వాళ్లు చేస్తుంటారు. కొందరు మొక్కలకు గోతులు తవ్వుతారు. కొందరు వంటలో సాయం చేస్తారు. సలహాలిస్తారు. కొందరు అనారోగ్యంగా ఉన్నవారికి ఓదార్పుగా దగ్గర కూర్చుని కబుర్లు చెప్తారు. కొందరు అక్కడి బాలమందిరంలోని పిల్లలతో ఆడుకుంటారు. వాళ్లకు కబుర్లు చెబుతూ వారిలో తమ మనుమలను చూసుకుంటారు.

మనిషి ఎప్పుడైనా కోరుకునేది తనకు తన మాటకు ఓ విలువ, ప్రత్యేకత ఉండాలని... వార్ధక్యంలో అది మరింత ఎక్కువవుతుంది. అందుకే కాబోలు, కని పెంచిన పిల్లలు ఎవరి పనుల్లో వాళ్లు నిమగ్నమై ఉంటేనో... కొందరు పని ఒత్తిడిలో విసుక్కుంటేనో... పెద్దలు తమ మాటకు విలువ పోయిందనీ, తమకు గౌరవం తగ్గిందనీ ఆత్మన్యూనతకు గురై, అనారోగ్యం బారిన పడతారు. ఆనందాశ్రమం వారికా లోటును తీరుస్తుండేసరికి, వాళ్లకు శ్రావణ్, అమృత కడుపున పుట్టిన పిల్లల కంటె ఎక్కువగా అనిపిస్తున్నారు. లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా, ఇంత చిన్న వయసులో వాళ్లకు అంత సేవాభావం ఎలా కలిగిందోనని విస్తుపోతున్నా, వాళ్ల మనసులు నిండుగా ఆశీస్సులు అందిస్తున్నాయి.

**000**

ఆనందాశ్రమం ఎంతో అభివృద్ధి చెందింది. ప్రభుత్వం గ్రాంటు కూడా దొరికింది.

ఒక విధంగా అన్నయ్య, తను కన్న కల నెరవేరింది. తామిద్దరూ విదేశాల్లో చదువుకుని ఎంతో సంపాదించారు. డబ్బు పంపిస్తూ ఈ దేశంలో ఉన్న అమ్మానాన్నలకు సమస్తసుఖాలు చేకూరుస్తున్నా మనుకునేవారే గాని... కాని తమ తల్లిదండ్రుల ఒంటరితనాన్ని, బాధను గుర్తించలేకపోయారు. చివరకు అమ్మానాన్నల ఒంటరి జీవితాన్ని గమనించినా, దుండగుల చేతిలో వాళ్లు హతమైపోయాక గాని తమ కళ్లు తెరచుకోలేదు.

తల్లిదండ్రులు ఆశించేది ప్రేమ ఆప్యాయతలు, ఆసరా తప్ప పిల్లల డబ్బు దస్కాన్ని కాదు-అని తెలుసుకునేసరికి తమకు వాళ్లు లేకుండా పోయారు.. అంతే... తాము తిరిగి విదేశాలకు వెళ్లలేదు!

అందుకే ఈ దేశంలోని ఏ తల్లిదండ్రులూ ఒంటరితనంతోనో, కన్నపిల్లల నిరసనల మధ్య అసంతృప్తితోనో బాధపడకూడదనే దృఢ సంకల్పంతో, అటువంటివారికి వార్ధక్యంలో సొంత బిడ్డల్లా తాము ఆసరా కావాలనే ఉద్దేశంతో, తమకున్నదంతా వెచ్చించి తండ్రి ఆనందరావు పేర ఈ ఆశ్రమానికి రూపకల్పన చేశారు. జీవిత నాటకంలో మరణానికి దగ్గరైన చివరి ఘట్టంలో వార్ధక్యం కనీసం కొందరికైనా మనోరంజకం కావాలనే తమ తపన నెరవేరింది.

అయినా అమృత మనసులో ఒక్క విషయం... ఇప్పటికీ ముల్లులా గుచ్చుకుంటూనే ఉంది.

అది పార్వతమ్మగారి మరణం...

'అమ్మమ్మ చెప్పిన కథలు' కేసెట్ల ద్వారా ఆశ్రమం వాళ్లు ఏదో డబ్బు సంపాదించేస్తున్నారు-అనే అపోహతో, తల్లిని తమ దగ్గరే ఉంచుకుని ఆ డబ్బేదో తామే పొందవచ్చు అనుకున్న కొడుకులు, శ్రావణ్‌తో పోట్లాటకు దిగినపుడు, తాను వెళ్తున్నది పులి బోనులోకి అని తెలిసీ, పార్వతమ్మగారు తనంతట తానే కొడుకుతో వెళ్లిపోయింది.

కొడుకులు, ఆర్నెల్లు తల్లిని అటూ, ఇటూ తిప్పారు. కేసెట్ల కంపెనీకి తీసుకెళ్లారు.

కాని పార్వతమ్మగారి కేమైందో... ఆమె గొంతు పెగల్లేదు.

"ఆమె నటిస్తోంది" అని నెపం వేశారు కొడుకులు.

"డబ్బు కొడుకులకి ఇవ్వడం ఇష్టం లేదావిడకి" అని కోడళ్లు తిట్టారు.

ఆవిడ బ్రతుకు మళ్లీ హీనమైపోయింది. ఆవిడను మేపడం వృథా అనుకున్న కొడుకులు, మళ్లీ మొదటికి వచ్చారు.

ఆమెను వెళ్లి పొమ్మని అన్యాపదేశంగా చెప్పారు.

పార్వతమ్మగారు రిక్షా దిగి ఆనందాశ్రమంలో అడుగుపెట్టే సమయంలో, అమృత ఏదో రాసుకుంటోంది.

ఎదురుగా వగరుస్తూ నిల్చున్న మనిషిని గుర్తు పట్టలేకపోయింది. మొదట్లో... బక్కచిక్కి నల్లబడిపోయి ఎలా ఉండేదో మళ్లీ అదే విధంగా తయారైంది.

ఆమెను గుర్తు పట్టాక విలవిల్లాడిపోయింది. వెంటనే చకచకా ఆవిడకి ఉపచారాలు చేశారు శ్రావణ్, అమృత.

పార్వతమ్మ, అమృతను కౌగిలించుకుని ఏడ్చేసింది. 'నాకిక్కడి నుండి వెళ్లడం ఇష్టం లేదు అమృతా! కాని నిరపరాధులైన మిమ్మల్ని, నా కొడుకులు అంటున్న నానా మాటలు భరించలేక, నిజంగానే మిమ్మల్ని కోర్టుకి కీడుస్తాడని భయపడి గొర్రెలా వెళ్లిపోయాను. నన్ను మీరంతా ఎంత అసహ్యించుకున్నారో నని ఒకటే బాధపడ్డాను. నా బిడ్డలు స్వార్థపరులు అని నాకు తెలుసు. ఎందుకు నా మీద అంత ప్రేమ పుట్టి తీసికెళ్తున్నారో తెలియనిదానివి కాను. కాని అక్కడ నేను నటించలేదు అమృతా! నా గొంతు నిజంగానే పెగలలేదు. రికార్డింగుకి మీరెంత కష్టపడేవారో వాళ్లకేం తెలుసు? మీ ప్రోత్సాహం లేనిదే నేనేం చెయ్యలేనని గుర్తించని వాళ్ల చేత నానామాటలూ పడ్డాను.

'కోయిల, మామిడి చిగుళ్లు తింటూ వసంతం సాయంతోనే పాడగలదని మూర్ఖులు వాళ్లకేం తెలుసు? మనం చేల గట్ల మీద పోతుంటే ఎన్నో రకాల రంగురంగుల పూలు, చిన్న గరికపూలు కనిపిస్తాయి. కాస్త ఆగి చూసే తీరిక మనకి ఉండదు. పైగా దారికి అడ్డంగా ఉన్నాయి కాబట్టి, తొక్కుతూ పోతాం. అందులో నలిగినవి కొన్ని, తిరిగి తల ఎత్తేవి కొన్ని, అసలు మనం పట్టించుకోం. ఎవరయినా కళాత్మకహృదయాలు ఆ పూలను తెచ్చి కుండీలలో అలంకరిస్తే మనమే చూసి 'ఇంత కొత్త రకం పూలెక్కడివి? ఎంత కళాత్మకంగా ఉన్నాయో' అంటూ కాంప్లిమెంట్లు విసరుతాం. మనుషులయినా అంతే. స్థానాన్ని బట్టి విలువలు మారుతూ ఉంటాయి. పనికి రాని బిడ్డలు పరిత్యజించిన వృద్ధులకు మీరిద్దరూ చేస్తున్న సేవ అపూర్వమమ్మా! కాని ఒక్కటే సంతోషం. చివరిలో నా బిడ్డలు నన్ను నా ఇష్టానికే వదిలేశారు. కడ దాకా మిమ్మల్నే కన్నబిడ్డలుగా చూస్తూ చచ్చిపోతానమ్మా! నన్ను పొమ్మనవు కదా!"

ఆవిడ ఆర్తికి కదిలిపోయింది. ఓదార్పుగా తనే కన్నతల్లిలా ఆమెను పొదివి పట్టుకుంది అమృత.

చిక్కి శల్యమై ఆరోగ్యం శిథిలమైన ఆవిడ, ఎన్నాళ్లో బ్రతకలేదు. ఆశ్రమవాసులు పాడే భజన వింటూ తృప్తిగా ఓ రోజు కన్ను మూసింది. శ్రావణ్ గాఢంగా నిట్టూర్చాడు. అతని కళ్ల నిండుగా నీళ్లు...

ఎన్ని అవాంతరా లెదురైనా తనూ, చెల్లాయీ ఆనందాశ్రమాన్ని విజయవంతంగా నడిపిస్తుంటేనే, తమ తల్లిదండ్రుల ఋణం తీరుతుంది వాళ్ల ఆత్మ శాంతిస్తుంది!

●